


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

మంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా నిర్మల్ రూరల్ మండలం కొండాపూర్ సమీపంలోని చంద్రశేఖర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం పరిశీలించారు. ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసే స్టాళ్లు, నూతన రేషన్ కార్డుల పంపిణీ, పలు పథకాల కింద ధ్రువీకరణ పత్రాల పంపిణీకి సంబంధించి ఏర్పాట్లను ఆమె సమీక్షించారు. అదేవిధంగా స్టాళ్లు, సీటింగ్, స్టేజ్, పార్కింగ్ వంటి అంశాలను పరిశీలించి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమం విజయవంతంగా సాగేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, నిర్దేశిత సమయానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, జడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీవో విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.



సాదాబైనామాల సమస్యకు త్వరలో పరిష్కారం

కిషోర్‌కుమార్, అదనపు కలెక్టర్, నిర్మల్

ప్ర: సాదాబైనామాలకు పరిష్కారం ఎప్పుడు?

జ: న్యాయపరమైన సమస్యలు తొలగిపోగాయి. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుంది.

ప్ర: జిల్లాలో క్రమబద్ధీకరణ కోసం ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి?

జ: 2020కి ముందు జిల్లాలో 6వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. భూభారతి రెవెన్యూసదస్సుల ద్వారా జిల్లాలో 9వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

ప్ర: పాతదరఖాస్తులనే పరిగణలోకి తీసుకుంటారా? కొత్త వాటిని సైతం పరిష్కరిస్తారా ?

జ: క్రమబద్ధీకరణపై ప్రభుత్వంపై విధివిధానాలు రావాల్సి ఉంది.

ప్ర: లావని పట్టాలు, నిషేధిత భూములను సైతం క్రమబద్ధీకరించాలని పలువురు కోరుతున్నారు. ఆ దిశగా ప్రభుత్వం ఏమైనా చర్యలు చేపడుతుందా?

జ: లావని పట్టాల విషయంలో ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు. క్షేత్రస్థాయిలో ఉన్న డిమాండ్లన్నీ ప్రభుత్వం దృష్టికి వెళ్లాయి. సాధ్యాసాధ్యాలను పరిశీలించిన తర్వాత మెరుగైన నిర్ణయాన్ని తీసుకునేలా ప్రభుత్వం ఆలోచన చేస్తోంది.

ప్ర: సాదాబైనామాల క్రమబద్ధీకరణ సమయంలో ఎదురయ్యే సమస్యలకు ఏ విధంగా చెక్ పడతారు?

జ: తెల్లకాగితంపై రాసుకున్న ఒప్పందాలను దృష్టిలో ఉంచుకొని క్షేత్రస్థాయిలో సాగులో ఎవరున్నారో పరిశీలించేందుకు ఆర్డీవో ఆధ్వర్యంలో విచారణ నిర్వహించి గ్రామస్థులు, చుట్టుపక్కల రైతుల నుంచి వివరాలను సేకరించి ప్రక్రియ ముందుకెళ్తుంది.

ప్ర: సాదాబైనామాల క్రమబద్ధీకరణ తర్వాత తవకు నష్టం జరిగిందని భావించే వారికి ఏ విధమైన అవకాశం ఉంటుంది?

జ: భూమిని విక్రయించినవారు తమకు నష్టం జరిగినట్లు భావిస్తే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసుకునేలా వెసులుబాటు కల్పిస్తారు. ఈ ఫిర్యాదుతో మరోసారి క్షేత్రస్థాయిలో విచారిస్తాం. తెల్లకాగితాలపై ఒప్పందంతో భూమి కొనుగోలు చేసినవారికి ఆ భూమిపై హక్కు సంక్రమింపజేసే క్రమంలోపకడ్బందీగా ముందుకెళ్తాం.

• నిర్మల్, ఆంధ్రజ్యోతి



బాసర సరస్వతీ ఆలయం



ట్రిపుల్‌ఐటీ క్యాంపస్

'బాస'ర చేయరా..

- నిధుల కోసం ఎదురు చూస్తున్న సరస్వతీ క్షేత్రం
- బడ్జెట్ లేక ట్రిపుల్‌ఐటీకి కష్టాలు
- వెక్కిరిస్తున్న పర్యాటక అభివృద్ధి
- నేడు బాసరకు రానున్న ఇన్‌చార్జి మంత్రి జూపల్లి

బాసర క్షేత్రం ప్రగతి బాట పట్టడానికి నిధుల లేమి ఆటం కంగా మారింది. రాష్ట్రంలో ఉన్న ఏకైక ట్రిపుల్ ఐటీ, దేశంలోనే రెండో ప్రాచీన దేవాలయం సరస్వతీ అమ్మ వారి ఆలయం ఇక్కడ ఉంది. ఈ రెండూ కూడా నిర్లక్ష్యానికి గురవుతూనే ఉన్నాయి. ప్రఖ్యాత పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేసేందుకు అనుకూలంగా ఉన్న ప్రాంతం నిరాధరణకు గురవుతోంది. నేడు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటన నేపథ్యంలో బాసర వాసుల ఎజెండాపై ప్రత్యేక కథనం..

• బాసర, ఆంధ్రజ్యోతి

అమ్మవారి క్షేత్ర అభివృద్ధి నిధుల వెనక్కి...

రాష్ట్రంలో ప్రధాన దేవాలయాల్లో బాసర అమ్మవారి క్షేత్రం ఒకటి. పిల్లలకు అక్షర శ్రీకారం జరిపించేందుకు దేశంలోని నలుమూలల నుంచి వస్తుంటారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల విన్నపాల మేరకు రూ.50కోట్లు కేటాయించింది. అందులో రూ.8కోట్లు వివిధ పనులకు ఖర్చు చేశారు. మిగిలి రూ. 42కోట్లు ఈ కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. దీంతో బాసర అమ్మవారి మాస్టర్‌ప్లాన్ అభివృద్ధి అటకెక్కింది. దాతలు అభివృద్ధి కోసం రూ. కోట్ల నిధులు ఇచ్చేందుకు ముందుకు వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం అనుమతించకపోవడం పెద్ద సమస్యగా మారింది. ప్రస్తుతం అమ్మవారి ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తు లు వస్తుంటారు. నది తీరంలో గల అమ్మవారి క్షేత్రంలో భక్తులు ఆహ్లాదకరంగా గడిపేందుకు అనువైన ప్రదేశాలు లేవు.

నిధులు లేక ట్రిపుల్‌ఐటీ డీలా...

పదో తరగతి తర్వాత సాంకేతిక విద్య అభ్యసించడానికి గ్రామీణ విద్యార్థులకు బాసరలో ఆర్జీయూకేటీ ఉంది. ప్రస్తుతం 9వేల మంది విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. ఏడాదికి రూ. 100 నుంచి 150 కోట్ల బడ్జెట్ అవసరముంటే రాష్ట్ర ప్రభుత్వం రూ.30 నుంచి ర. 40 కోట్లు మాత్రమే తమ బడ్జెట్‌లో ఇస్తోంది. అసలు కేటాయించిన అరకొర నిధుల కూడా పూర్తిగా విడుదల చేయడం లేదు. దీంతో బాసర ట్రిపుల్‌ఐటీ నిధులు లేక కొట్టుమిట్టాడుతోంది. ప్రభుత్వం నుంచి ఫీజు రీయంబర్స్‌మెంట్ కింద రూ.100 కోట్లు బకాయి ఉంది. మూడేళ్లకిందట బాసరకు మంజూరయిన కేంద్రీయ విద్యాలయం ఇప్పటికి ఏర్పాటు కాలేదు.

నేడు బాసరకు రానున్న మంత్రి జూపల్లి

జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు బాసరకు రానున్నారు. ఉదయం 10గంటలకు చేరుకున్న మంత్రి మధ్యాహ్నం 2గంటల వరకు వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. అమ్మవారిని దర్శించుకోవడం, ఆ తర్వాత మండల కేంద్రంలో 30 పడకల నూతన ఆసుపత్రి భవనానికి భూమిపూజ, ట్రిపుల్‌ఐటీని సందర్శన, విద్యార్థులతో ముఖాముఖి, క్యాంపస్‌లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఇటీవల వరదలకు నీటమునిగిన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడనున్నారు.

పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి

• ఆనంద్ బండారి, రైతు సంఘం జిల్లా నాయకుడు



వరదల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. మొత్తం పెట్టుబడి పెట్టి పంటలు తీసుకునే సమయంలో వరద వచ్చి రైతులను నిండా ముంచింది. ప్రతీ రైతును ప్రభుత్వం ఆదుకోవాలి. అందించే పరిహారాన్ని త్వరగా పంపిణీ చేయాలి.

జాతీయ లోక్ అదాలత్ ద్వారా

ప్రజలకు తక్షణ న్యాయం

- ఈనెల 13న జాతీయ లోక్ అదాలత్ : ఎస్పీ



నిర్మల్ రూరల్, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్ ద్వారా ప్రజలకు తక్షణ న్యాయం జరుగుతుందని ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. ఈనెల 13న జిల్లావ్యాప్తంగా జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయలోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిన్న కేసులు, ట్రాఫిక్ చలానాలు, మైనర్ క్రిమినల్ కేసులు, సివిల్ డిస్ప్యూట్లు వంటి వివాదాలు లోక్ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కారం పొందవచ్చని తెలిపారు.

కళాశాలను తనిఖీ చేసిన డీఐఈవో

ఖానాపూర్, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్మల్ డీఐఈవో జాదవ్ పరుశురాం మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి పేరు ఎఫ్ఆర్ఎస్ (ఫేషియల్ రికగ్నేషన్ సిస్టం)లో తప్పకుండా నమోదు చేయాలన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాకవి కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తెలుగు భాష అభివృద్ధికి కాళోజీ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆనంద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సంతోష్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తెలంగాణ జానపద గేయం గొప్పతనంను పాట రూపంలో ప్రదర్శన

సాంస్కృతిక ప్రదర్శనలో నిర్మల్ ప్రతిభ

- వేదికగా నిలిచిన నిర్మల్ కొయ్య బొమ్మలు

ముథోల్, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లోని ఉదయపూర్ వేదికగా జరిగిన జాతీయ స్థాయి సాంస్కృతిక ప్రదర్శనలో భాగంగా జరిగిన రాష్ట్రస్థాయి ప్రదర్శన విభాగం ప్రత్యేక ప్రశంసలు అందుకుంది. రాష్ట్ర ప్రతినిధులుగా పాల్గొన్న బృందం తమ ప్రతిభతో ఆకట్టుకుని ప్రశంసలు పొందారు. సంప్రదాయ కళా వైభవం, స్థానిక సాంస్కృతిక విలువలను ప్రతిబింభిస్తూ అందించిన ఈ ప్రదర్శన, జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రతిష్టను మరింత ఎత్తుకు వెళ్లినట్లు చెప్పుకోవచ్చు. ప్రదర్శనలో నిర్మల్ కొయ్య బొమ్మల జియోగ్రాఫికల్ గుర్తింపును జాతీయస్థాయిలో పీపీటీ ద్వారా ప్రదర్శించారు. ఈ వర్క్‌షాప్‌లో తెలంగాణ తరఫున ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఉపాధ్యాయుడు మాదరి ఎల్లన్న ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జాతీయ నూతన విద్యావిధానం 2020(ఎన్ఈపీ)లో భాగంగా విద్యలో తోలు బొమ్మలాట పాత్రపై ఈ పదిహేను రోజుల వర్క్‌షాప్ నిర్వహించినట్లు ఉపాధ్యాయుడు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి దర్శనం భోజన్నతో పాటు పలువురు అభినందించారు.

శ్రీగిరిక్షేత్రంలో స్వామివారికి పంచామృతాభిషేకం

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీ కురుక్షేత్రంలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామివారికి కావడి సేవ, రథసేవ, పంచామృతాలతో అభిషేకించినట్లు గురుమాత రాజరాజేశ్వరి దేవి ఆర్చారి రాజవ్వ తెలిపారు. ఈ కార్యక్రమంలో వీర నారాయణ స్వామి, శనిగారపు చిన్నయ్య, సముద్రపెల్లి కిషన్, చింతపండు పోశెట్టి, నరేష్, గణేష్, రామయ్య, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

- ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్



పార్టీ ప్రతినిధులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్

భైంసా, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో బుధవారం జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటనను విజయవంతం చేయాలని ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్‌పాటిల్ కోరారు. మంగళవారం భైంసాలోని క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్‌కు చెందిన మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ ప్రతినిధులు క్షేత్రస్థాయిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ సర్కార్ చేపడుతున్న అభివృద్ధి, ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు, సాధించిన విజయాలు, నిర్వహించిన సంస్కరణలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ బలోపేతానికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు గంగారెడ్డి, ప్రేమ్‌నాథ్ రెడ్డి, దేవిదాస్, పురంశెట్టి రవి కుమార్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

బాసర ఆర్జీయూకేటీలో విచారణ

- విద్యార్థుల ఆత్మహత్యల ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆరా

బాసర, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): బాసర ట్రిపుల్ ఐటీ జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులు మంగళవారం విచారణ చేపట్టినట్లు తెలిసింది. సోమవారం రాత్రి ఇక్కడికి చేరుకున్న జాతీయ మానవ హక్కుల కమిషన్ ప్రతినిధులతోపాటు రాష్ట్రస్థాయి మానవ హక్కుల కమిషన్ సభ్యులు క్యాంపస్‌లో బస చేసినట్లు తెలుస్తోంది. అయితే యూనివర్సిటీపై జాతీయ, రాష్ట్రస్థాయిలో ఫిర్యాదులు వెళ్లడంతో ఈ మేరకు క్యాంపస్‌ను సందర్శించినట్లు సమాచారం. గత రెండేళ్లలో క్యాంపస్‌లో దాదాపు 12 మంది విద్యార్థులు వివిధ కారణాలతో మృతిచెందారు. సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఈక్రమంలో నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల విద్యార్థి నేతలపై యూనివర్సిటీ సిబ్బంది దాడి చేసిన ఘటనలు ఉన్నాయి. ఆందోళన చేసిన విద్యార్థులపై యూనివర్సిటీ అధికారులు పోలీసు కేసులు నమోదు చేశారు. ఇలా వివాదాస్పద ఘటనలు చోటుచేసుకోవడం వీటిపై కమిషన్ సభ్యులకు విద్యార్థి వర్గాలు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ విషయాలపై కమిషన్ సభ్యులు యూనివర్సిటీలో విచారణ చేపట్టారు. యూనివర్సిటీ అధికారులతో పాటు పోలీసు శాఖ, ఇతర వర్గాల నుంచి వివరాలను సేకరిస్తున్నట్లు యూనివర్సిటీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. జాతీయ మానవ మక్కుల కమిషన్ సభ్యుల రాకను స్థానిక అధికార వర్గాలు, యూనివర్సిటీ అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. వారి పర్యటనకు సంబంధించి ఎలాంటి సమాచారం బయటకు పోకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. యూనివర్సిటీలో ఒకరకంగా అనాధికారికంగా నిషేధాజ్ఞలు ఆదేశాలిచ్చారు. సాధారణ రోజుల్లోనే మీడియాకు యూనివర్సిటీలో ప్రవేశంలేదు. జాతీయ మానవహక్కుల కమిషన్ పర్యటన గురించి యూనివర్సిటీ అధికారులను ప్రయత్నించగా జిల్లాస్థాయి అధికారులను సంప్రదించాలనే సమాధానం వచ్చింది. విచారణ ఎంత గోప్యత పాటిస్తున్నారో అర్థమవుతోంది.

'ఆరని వెలుగు-సూర్యం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరణలో మాట్లాడుతున్న అతిథులు

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అమరుల బంధుమిత్రుల కమిటీ ఆధ్వర్యంలో ప్రముఖ విప్లవకారుడు వరగంటి పండరి విప్లవ ప్రస్తావనకు సంబంధించిన ఆరని వెలుగు - సూర్యం పుస్తకాన్ని ఆవిష్కరించినట్లు రిటైర్డ్ హెచ్‌ఎం వరగంటి మురళీధర్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎంపీ సోయం బాపురావు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లాఅధ్యక్షుడు ఎంసీ లింగన్న, పీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్, విరసం పీనాక పాణి ఉన్నారు.

12న జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు

ముథోల్, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాస్థాయి కళా ఉత్సవ్ 2025 పోటీలు ఈనెల 12 శుక్రవారం నారాయణ పాఠశాల నిర్మల్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి భోజన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాల, కళాశాలల్లో కేవలం 9 నుండి 12 తరగతి చదువుతున్న వారు మాత్రమే అర్హులని వెల్లడించారు. కావునా ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు తమ విద్యార్థులను నిర్వహించే పోటీలలో పాల్గొనడానికి ప్రోత్సహించగలరని కోరారు.



నిరసన తెలుపుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కుభీర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గత నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని తపస్వి, వివేకానంద డిగ్రీ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు రాస్తారోకో నిర్వహించారు. స్థానికబస్టాండ్ వరకు నినాదాలు చేసుకుంటూ ర్యాలీగా వెళ్లి బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయక పోవడంతో కళాశాల నిర్వహణ భారంగా మారిందని, దీంతో కళాశాలలు మూసివేసే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. దీంతో విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో ఏబీఎస్‌టీ నాయకులు జావారే రాహుల్, టీజీవీపీ కార్యదర్శి తులసిరామ్, కళాశాల ప్రిన్సిపాల్‌లు డా.సట్లరవి, సంధ్యారాణి, అధ్యాపకులు దత్తాత్రి, సాయన్న, రాములు, శ్రీనివాస్, లక్ష్మణ్, పోశెట్టి, తదితరులు ఉన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

కుంటాల: పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, టీపీ డీఎంఏ ప్రైవేటు డిగ్రీ కళాశాల యాజమాన్యం ఎగ్జిక్యూటివ్ మెంబర్ బోయ సాయిలు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కల్లూర్ గ్రామంలో స్థానిక వాసవి డిగ్రీ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థుల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. నాలుగేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం పెండింగ్‌లో ఉందని అన్నారు. ఫీజులు రాక కళాశాలలు నడపడం భారంగా మారిందని అన్నారు. భవనాల అద్దె, అధ్యాపకుల వేతనాలు చెల్లించలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం స్పందించి బకాయిలు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో వాసవి విద్యాసంస్థల సిబ్బంది గట్టుపల్లి శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

భైంసావాసులకు

తీరనున్న విద్యుత్ ఇక్కట్లు

- అదనంగా మరో 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు
- మెరుగుకానున్న సరఫరా వ్యవస్థ
- దూరం కానున్న లోవోల్టేజీ ఇబ్బందులు

భైంసా,సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): భైంసావాసులు గత కొంత కాలంగా ఎదుర్కొంటున్న విద్యుత్ సరఫరా సమస్యలు తొలగిపోనున్నాయి. ఇక్కడి సబ్ స్టేషన్‌లో పరిధిలో మంగళవారం అదనపు 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు విద్యుత్ అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే ఒక 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా పట్టవాసులకు విద్యుత్ సరఫరా వ్యవస్థ కొనసాగుతుండగా మంగళవారం అదనంగా మరో 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా సేవలు అందించేందుకు రంగం సిద్ధం చేశారు.

లోవోల్టేజీతో సమస్య

భైంసా పట్టణ పరిధిలో విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా నిర్వహణ వ్యవస్థ మెరుగుపడకపోవడంతో గత కొంతకాలంగా విద్యుత్ సరఫరాలో తరుచూ అంతరాయాలు ఏర్పడుతున్నాయి. లోవోల్టేజీ సమస్య ఏర్పడి వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. పట్టణ పరిధిలో అన్నికెటగిరిలకు సంబంధించి 25వేలకు పైగా విద్యుత్ కనెక్షన్లు ఉండగా నిత్యం లక్షకు పైగా యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతోంది. అయితే ఇక్కడి సబ్‌స్టేషన్ పరిధిలో ఒకే 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా విద్యుత్ సరఫరా కొనసాగుతుండటంతో సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా సరఫరా వ్యవస్థ మెరుగుపడలేదు. దీనికితోడు రోజుసరఫరాలో లోపాలు, లోవోల్టేజీ సమస్యలు అధికమయ్యాయి. పరిస్థితిని సమీక్షించిన విద్యుత్ శాఖ భైంసా డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏడీఈ అధిత్య, ఏఈ మోహన్‌లు సరఫరా సమస్యలను నివారించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే ఉన్నతాధికారులకు అదనపు 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ అవశ్యకతను విశదీకరించి సంబంధిత ట్రాన్స్‌ఫార్మర్ సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టారు. మంగళవారం ఉదయం ఇక్కడి సబ్ స్టేషన్‌కు అదనపు 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ సరఫరా అవ్వగా మధ్యాహ్నం 2గంటల నుంచే అధికారులు సంబంధిత ట్రాన్స్‌ఫార్మర్ బిగింపునకు చర్యలు చేపట్టారు. ఒకరోజు వ్యవధిలో ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా విద్యుత్ సరఫరా మొదలయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు వెల్లడించారు. పట్టణవాసులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలన్నీ తొలగిపోనున్నాయని ట్రాన్స్‌కో అధికారులు వెల్లడించింది.



సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేస్తున్న ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్

ప్రాదేశిక ఎన్నికలకు కసరత్తు

- నేడు వెలువడనున్న తుది ఓటరు జాబితా
- పూర్తయిన పోలింగ్ కేంద్రాల ఖరారు
- ఎన్నికల ప్రకటన లేకున్నా పల్లెల్లో వేడెక్కుతున్న రాజకీయం

భైంసా, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజా పరిషత్, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితాను అధికార యంత్రాంగం సిద్ధం చేసింది.బుధవారం తుది ఓటరు జాబితాను ప్రకటించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా, మండల పరిషత్ అధికారులు ఇది వరకే ఓటరు ముసాయిదా జాబితాను ప్రకటించారు. ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ పూర్తిచేసి తుది జాబితా ప్రకటించేందుకు సన్నద్ధమయ్యారు. గతంలో ఈ ప్రక్రియ పూర్తి చేసినా తాజాగా సవరించిన ఓటరు జాబితా ప్రకారం మళ్లీ సిద్ధం చేశారు.

తుది జాబితా ప్రకటనకు రంగం సిద్ధం

ముసాయిదా ఓటరు జాబితాను అధికారులు ఇప్పటికే ప్రకటించారు. తాజాగా తుది ఓటరు జాబితా ప్రకటించేందుకు గాను ఏర్పాట్లు పూర్తి చేశారు. ముసాయిదా ఓటరు జాబితాపై ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. ఇందులో భాగంగా ఈ నెల 8న జిల్లా, మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించారు. 9న ఓటరు జాబితాలు, పోలింగ్ కేంద్రాలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులు, అభ్యంతరాలపై విచారణ జరిపి తుది నిర్ణయానికి చర్యలు చేపట్టారు. . 10(బుధవారం)న అన్ని నియోజకవర్గాల పరిధిలో జిల్లా, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల్లోని పోలింగ్ స్టేషన్లలో తుది జాబితాలను ప్రకటించేలా అధికారులు సన్నద్ధమయ్యారు.

జిల్లాలో 18 జడ్పీటీసీ, 157 ఎంపీటీసీ స్థానాలు

జిల్లా పరిధిలో మొత్తం 18 జడ్పీటీసీ, 157 ఎంపీటీసీ స్థానాలున్నాయి. వీటి ఎన్నికల కోసం అధికార యంత్రాంగం 892 పోలింగ్ కేంద్రాలను ఖారారు చేసింది. ఇందులో 200 మంది ఓటర్లున్న పోలింగ్ కేంద్రాలు 413 ఉన్నాయి. 201 నుంచి 400 మందివరకు ఓటర్లున్న పోలింగ్ కేంద్రాలు 435 ఉండగా 401 నుంచి 650 మంది వరకు ఓటర్లున్న పోలింగ్ కేంద్రాలు 44 ఉన్నాయి.

జిల్లాలో 4,49,302 మంది ఓటర్లు

జిల్లాలో 18 జడ్పీటీసీ, 157 ఎంపీటీసీ స్థానాల పరిధిలో ముసాయిదా ఓటరు జాబితాను నాలుగు రోజుల క్రితం అధికారులు ప్రకటించారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 4,49,302 మంది ఉన్నారు. ఇందులో 2,13,205 మంది పురుషులు, 2,35,485 మంది మహిళలు, 12 మంది ఇతరులు ఉన్నారు. జిల్లాలోని 18 మండలాల్లో 400 గ్రామ పంచాయతీల పరిధిలో 892 పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు ప్రకటించారు. బుధవారం స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి తుది ఓటరు జాబితా ప్రకటించేందుకు గాను అధికార యంత్రాంగం కసర్తులు పూర్తి చేసింది.



తుది ఓటరు జాబితాను రూపొందిస్తున్న భైంసా ఎంపీడీవో, కార్యాలయ అధికారులు

పల్లెల్లో వేడెక్కుతున్న రాజకీయం..

సర్పంచ్, మండల పరిషత్ ఎన్నికల నిర్వహణకు అధికారులు కసరత్తు చేస్తుండడంతో పల్లెల్లో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ఎన్నికల నిర్వహణ విషయంలో ప్రభుత్వం దోబూచులాడే తీరుతో వ్యవహరిస్తున్నప్పటికి స్థానిక సంస్థల ఎన్నికల ఆశావాహులు తమ చర్యలను మాత్రం వేగవంతంగానే కొనసాగిస్తున్నారు. అందివచ్చిన అవకాశాలతో పట్టు పెంచుకునే దిశగా ముందుకు సాగుతున్నారు. వారం రోజుల క్రితం వరకు ఆశావాహులు వినాయక మండపాల వద్దకు వెళ్లి చందాలు ఇచ్చారు.ప్రస్తుతం బతుకమ్మ, దుర్గామాత వేడుకలలో ప్రధాన భూమిక పోషించే రీతిలో చర్యలు చేపడుతున్నారు. ఎన్నికలకు సంబంధించి ఎలాంటి సమాచారం వెలువడకుడకున్న, రిజర్వేషన్ల ప్రక్రియ తేలకున్నా.. ఎలాగైనా తాము బరిలో ఉంటామన్న ధీమాతో ఆశావహులు తమ వంతు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

ఎకరాకు రూ.30వేలు నష్టపరిహారం ఇవ్వాలని తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ముథోల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భారీవర్షం కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.30వేల చొప్పున నష్టపరిహారం అందించాలని మంగళవారం ముథోల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీలతకు ముథోల్ రైతులు వినతి పత్రాన్ని అందజేశారు. అతిభారీ వర్షాల కారణంగా పంట చేలల్లో ఇసుక పేరుకుపోయి వరదలకు కొట్టుకుపోయి న, దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం వెంటనే ఆదుకొని తగిన నష్టపరిహా రం నష్టపోయిన ప్రతీ రైతుకు అందించాలని కోరారు. కార్యక్రమంలో తాలూకా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు రమేష్, మండల బీజేపీ అధ్యక్షుడు కోరి పోతన్న, వీడీసీ అధ్యక్షుడు విఠల్, మాజీ సర్పంచ్ అనిల్, రైతులు, తదితరులున్నారు.

రాజ్‌గోండు సేవా సమితి మండల కార్యవర్గం ఎన్నిక

మామడ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో మంగళవారం రాజ్ గోండు సేవా సమితి మండల నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. మామడ మండల అధ్యక్షుడిగా సీడం ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా సీడం బాదు, ఉపాధ్యక్షుడిగా మదన్‌రావు, సలహాదారుడిగా సంతోష్, సభ్యులుగా తొడసం మాణిక్‌రావు, ఎం.చిత్రు పాల్గొన్నారు. గిరిజన సంక్షేమం అభివృద్ధి కోసం పాటుపడతానని, గిరిజనులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషిచేస్తానని కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు.



కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్



నిర్మల్‌లోని తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో..



నిర్మల్‌లోని దీక్ష జూనియర్ కళాశాలలో..

కాళోజీకి ఘన నివాళి

నిర్మల్‌రూరల్/కుంటాల/ముథోల్/ దిలావర్‌పూర్/ ఖానాపూర్, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యో తి): ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయం తి వేడుకలను మంగళవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ హాజరై కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ కవి సీనియర్ వైద్యులు డాక్టర్ దామెర రాములు, దీక్ష జూనియర్ కళాశాలలో ముథోల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీలత, కుంటాలలోని కల్లూరు వాసవి విద్యాసంస్థల ఆధ్వర్యంలో, మండలంలోని మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



ముథోల్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో..



మున్సిపల్ కార్యాలయంలో..



కల్లూరులో వాసవి విద్యాసంస్థల ఆధ్వర్యంలో..



మస్కాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

సదర్మాట్‌కు సందర్శకుల తాకిడి

ఖానాపూర్, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడంపెల్లి అడవుల్లో గోదావరి నదిపై ఉన్న పురాతన ఆనకట్ట సదర్మాట్‌కు సందర్శకుల తాకిడి పెరుగుతోంది. మంగళవారం ఖానాపూర్, నిర్మల్, మెట్‌పల్లి, కోరుట్ల తదితర ప్రాంతాల నుండి సదర్మాట్‌కు పర్యాటకులు భారీగా తరలివచ్చారు. సదర్మాట్ అందాలను చూసి మైమరిచిపోయారు. సదర్మాట్ వద్ద గోదావరి నదిపై అడ్డంగా నిర్మించిన రాతి మత్తడి పైనుండి నదిలోకి దూకుతున్న సుందర దృశ్యాలు చూపరులను ఇట్టే కట్టిపడేస్తున్నాయన్నారు.



సదర్మాట్ వద్ద ఫొటోలు దిగుతున్న పర్యాటకులు

ఉత్తమ ఉపాధ్యాయురాలికి ఘన సన్మానం

నర్సాపూర్(జి), సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయురాలు లక్ష్మీ మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికయ్యారు. పాఠశాల ఆవరణలో స్పెషల్ ఆఫీసర్ వీణ ఆధ్వర్యంలో లక్ష్మిని శాలువాతో సత్కరించారు.



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న దృశ్యం

కుభీర్‌లో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కుభీర్: మండలంలోని కేంద్రంలోని కుభీర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. మండలంలోని వివిధ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఉత్తమ పురష్కాలను అందించి సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆర్. విజయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు డి.సురేష్, గంగాధర్, ఎన్ నారాయణరెడ్డి, పీఆర్‌టీయూ టీఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లింగాల అరవింద్, ఎస్ దత్తాత్రి, ఉపాధ్యాయులున్నారు.

దిలావర్‌పూర్‌లో ..

దిలావర్‌పూర్: మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులను మంగళవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రశంసా పత్రం, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో శంకర్, కాంప్లెక్స్ హెచ్‌ఎం పి.సదానందం, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, గ్రామస్థులు

ఆదికర్మయోగి అభియాన్‌పై అవగాహన

దిలావర్‌పూర్, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాడెగాం గ్రామంలో మంగళవారం ఆది కర్మ యోగి అభియాన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు శాఖల వారీగా సమస్యలను విభజించారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకోనున్నట్లు ఎంపీవో గోవర్ధన్ తెలిపారు. కార్యక్రమానికి ఎంపీడీవో అరుణ రాణి నోడల్ అధికారిగా, ఎంపీవో గోవర్ధన్ గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా వ్యవహరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్, సీహెచ్‌వో రాజేశ్వర్, ఐకేపీ ఏపీఎం బోసు, పంచాయతీ కార్యదర్శి సునీల్, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, గ్రామస్థులున్నారు.

హైకోర్టు ఉత్తర్వులను ధిక్కరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

లక్ష్మణచాంద, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఉత్తర్వులను ధిక్కరిస్తున్న పీచర గ్రామస్తులపై చర్యలు తీసుకోవాలని నిర్మల్‌లోని ఏఎస్పీ కార్యాలయం ఎదుట ముదిరాజ్ కులస్థులు ఆందోళన చేపట్టారు. చేపలు పట్టడం ముదిరాజ్‌ల కులవృత్తి అని నినాదించారు. పీచర గ్రామ ముదిరాజ్ కులస్తుల వృత్తిపరమైన హక్కులను కాలరాస్తూ ఉపాధిని హరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ రాష్ట్ర నాయకులు బొజ్జ నారాయణ, శివన్న ముదిరాజ్, యాటకారి సాయన్న ముదిరాజ్ పాల్గొన్నారు.

టీఎస్‌సీపీజెడ్ ఫలితాల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల విడుదలైన టీఎస్ సీపీజెడ్ ఫలితాలలో పట్టణంలోని దీక్ష డిగ్రీ కళాశాల విద్యార్థి వంశీకృష్ణ కంప్యూటర్ సైన్స్ విభాగంలో రాష్ట్రస్థాయిలో ఐదవ ర్యాంక్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మెంగ శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల డైరెక్టర్ చిన్నాడి వెంకట్ రెడ్డి అభినందించారు. పీజీ సెట్ ఫలితాలలో మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన మీనా రితేష్ ఎంఎస్సీ ఫిజిక్స్ విభాగంలో రాష్ట్రస్థాయి ఏడవ ర్యాంక్ సాధించాడు. ఇటీవల సికింద్రాబాద్‌లోని రైల్వే డిగ్రీ కాలేజీలో ఎంపీసీ పూర్తి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

పిప్పల్‌కోటిని సందర్శించిన సీపీఎం నాయకులు

భీంపూర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిప్పల్‌కోటికి చెందిన మార్చెట్టి వెంకటి, అయిటి రామదాసుల కొట్టాలు విద్యుత్ షాక్ సర్క్యూట్‌తో దగ్ధమయ్యాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న సీపీఎం నాయకులు దర్శనాల మల్లేష్ మంగళవారం ఆ బాధిత కుటుంబాలను పరామర్శించారు. అధికారులు పరిశీలన చేసి పరిహారం మంజూరు చేయాలని కోరారు. అలాగే విద్యుత్ సిబ్బంది గ్రామాలలో పర్యవేక్షణ చేస్తూ ఇలాంటి సమస్యలు తెలుసుకోవాలని కోరారు.

అమ్మవారికి తేనెతో అభిషేకం

బాసర, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జ్ఞానసరస్వతి అమ్మవారి ఆలయంలో మంగళవారం సరస్వతీ మాతకు విశేషంగా తేనెతో అభిషేకం చేశారు. అభిషేక అనంతరం తేనె ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ తేనె ప్రసాదాన్ని విద్యార్థులు తీసుకుంటే జ్ఞాపకశక్తి, మేధస్సు అభివృద్ధి, అనారోగ్య సమస్యలు తొలగిపోతాయని దేవస్థాన వేద పండితులు నవీన్‌శర్మ తెలిపారు. ప్రతీ మంగళవారం తెల్లవారు జామున సరస్వతీ అమ్మవారికి తేనాభిషేక పూజ జరుగుతుందని పేర్కొన్నారు.

రెగ్యూలర్ ఏఈవోను నియమించాలి: రైతులు

కుభీర్, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): కుభీర్ గ్రామానికి రెగ్యూలర్ ఏఈవోను నియమించాలని కోరుతూ మంగళవారం గ్రామ రైతులు ఏవో సారికకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెగ్యూలర్ ఏఈవో లేక పోవడంతో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. పంట నమోదు, త్వరలో జరుగనున్న సోయాకొనుగోళ్లకు ఇబ్బంది అవుతుందని చెప్పారు. తమకు రెగ్యూలర్ ఏఈవోను నియమించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీచైర్మన్ కళ్యాణ్, మాజీ చైర్మన్ కందూర్ శ్రీనివాస్, నాయకులు సూదిరాజన్న, బొప్ప నాగలింగం, గ్రామ రైతులున్నారు.

'విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తాం'

సారంగాపూర్ , సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): అడెల్లి మహా పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపనను దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిపిస్తామని ఆలయ చైర్మన్ సింగం భోజాగౌడ్ అన్నారు. మంగళవారం మండలంలో గల అడెల్లి మహా పోచమ్మ ఆలయం వద్ద ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెలలో అడెల్లి ఆలయ జాతర ముగిసిన వెంటనే దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు అక్టోబర్ నెల 8 తేదిన వేద పండితులతో వేదం మంత్రాల మధ్య నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన జరిపిస్తామని తెలిపారు. ఈవిగ్రహ ప్రతిష్టాపనకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణరావు హాజరవుతుట్లు పేర్కొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

కుభీర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధుల ప్రభలకుండా ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డా. విజేష్‌రాథోడ్ సూచించారు. మండలంలోని గ్రామాల్లో షెడ్యూల్డ్ ప్రకారం వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం మండలంలోని గొడ్సారాలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులను పంపిణీ చేశారు. జ్వరాలతో బాధపడే రోగుల నుండి రక్తనమూనాలను సేకరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సూపర్‌వైజర్ సుగుణ, ఎంఎల్‌టీపీ పవన్, ఏఎన్‌ఎం విమల తదితరులున్నారు.

ఘనంగా ఫ్రెండ్‌షిప్ బ్యాంగిల్స్ ఫెస్టివల్

లక్ష్మణచాంద, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మునిపెల్లి గ్రామంలో ఫ్రెండ్షిప్ బ్యాంగిల్స్ ఫెస్టివల్‌ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలంతా సామూహికంగా ఒకరికొకరు గాజులను ధరించి, నూతన వస్త్రాలను స్వీకరించి తమ స్నేహాన్ని పరిమళింపజేసుకున్నారు. ఒకరికొకరు కుంకుమను నుదిటిపై దిద్దుకుని ముత్తైదువులా జీవించాలని ఆశీర్వదించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు మెరుగు స్వప్నతో పాటు మహిళలు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

ఖానాపూర్, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐదవ వార్డులో అనారోగ్యంతో మృతి చెందిన గోపికృష్ణ అంత్యక్రియలకు ఆ వార్డు కౌన్సిలర్ దంపతులు పరిమి లత, సురేష్‌లు ఆర్థిక సహాయం అందజేశారు. మంగళవారం పద్మావతి నగర్‌లోని బాధిత కుటుంబం ఇంటికి వెళ్లి పరిమి సురేష్ రూ. 5 వేల ఆర్థిక సహాయాన్ని గోపికృష్ణ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట కాలనీ వాసులు ఎర్రన్న, నరేష్, కన్నయ్య, మల్లికార్జున్, శంకర్, తదితరులున్నారు.

పంటనష్టం పరిహారం అందేనా?

- చేజారిన పత్తి సాగు చేసిన రైతుల ఆశలు
- అయోమయంలో అన్నదాతలు

కుభీర్, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసన భారీ వర్షాలు పత్తి రైతులను నిండా ముంచాయి. ప్రభుత్వం పంట నష్ట పరిహారం ఎంత ఇస్తుంది.. ఎప్పుడు ఇస్తుందని పత్తి రైతులు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. పత్తి పంటకు అనుకూలమైన నేలలు ఉండటంతో మండలంలో ప్రధాన పంటగా రైతులు ప్రతీ ఏడాది పత్తికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఖరీఫ్ ప్రారంభంలోనే వర్షాలు కురవడంతో రైతులు సకాలంలో విత్తనాలు నాటారు. పంట ఆశాజనకంగా పెరిగింది. దీంతో సకాలంలో మందులు పిచికారి, కలుపు నివారణ రసాయన ఎరువులు వేయటం వంటి వివిధ రకాల సంరక్షణ పనులు చేపట్టారు. మంచి దిగుబడులు వస్తాయని ఆశించిన రైతులకు అధికవర్షాలు ప్రకృతి వైపరిత్యాలు దెబ్బతీస్తున్నాయి.

పంటలను ముంచెత్తిన భారీ వర్షాలు

నెలలోనే పది, 12సార్లు భారీవర్షాలు, తుఫాను ప్రభావంతో పలు మార్లు వర్షం కురవడంతో ఎక్కడచూసినా పంట చేన్లలో నీరు చేరింది. ప్రస్తుతం పైత, కాత దశలో ఉండగా మొక్కలు ఎరుపుగా మారి ఎదుగుదల నిలిచిపోవడంతో నివారణ కోసం రైతులు కష్టపడుతున్నారు. అధిక వర్షాలకు పూత, కాత రాలుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఎకరం సాగుకు రూ. 25వేల నుంచి రూ. 30వేల వరకు ఖర్చువుతోంది. పంట చేతికి వచ్చే సమయంలో చేజారుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. మండలంలో సుమారు 50వేల ఎకరాల్లో సాగు వస్తీర్ణం ఉంది. ఈయేడు ఖరీఫ్‌లో 22వేల ఎకరాల్లో పత్తి పంట, 23 వేల ఎకరాల్లో సోయాబీన్, 3వేల ఎకరాల్లో మొక్కజొన్న, 500 ఎకరాల్లో పసుపు, 500 ఎకరాల్లో మిశ్రమ పంటలు సాగుచేశారు. ఇందులో నదిపరివాహక ప్రాంతాల్లోల పంట నష్టం అధికంగా వాటిల్లింది. వేయి ఎకరాల్లో పంటకు నష్టం జరిగినట్లు గ్రామాల రైతులు చెప్తున్నారు. కాగా 105 ఎకరాల్లో పత్తి, 130 ఎకరాల్లో సోయాబీన్, 13ఎకరాల్లో మొక్కజొన్న పంటలకు నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. కౌలు రైతుల ఆశలు ఆవిరై పోయాయి. తగిన గుర్తింపు లేక పోవడంతో ప్రభుత్వం పరంగా పరిహారం ఇచ్చినా తమకు రాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అధిక వర్షాలకు పత్తి చేనులో నిలిచిన నీరు (ఫైల్)

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాం

• ఈర్ల చరణ్, ఏఈవో కుభీర్



భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్నాం. పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతోపాటు నష్టాన్ని తెలుసుకుంటున్నాం. పంటలకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తున్నాం.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

సోన్, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడ్తాల్ గ్రామ శివారు హరిత రిసార్ట్ వద్ద కడ్తాల్ గ్రామానికి చెందిన డికొండ ప్రసాద్ (35) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడని ఎస్సై గోపి తెలిపారు. ప్రసాద్ సోమవారం సాయం త్రం మూతాపూర్ గ్రామంలోని గణేష్ నిమజ్జనం అనంతరం తిరిగి వస్తుండగా మంగళవారం గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతిచెంది ఉంటాడని ఎస్సై తెలిపారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించగా మృతుడి తలపై ఇతర చోట్ల గాయాలు ఉన్నట్లు గుర్తించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కనకాపూర్‌లో మరొకరు..

లక్ష్మణచాంద, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనకాపూర్ అక్షర హైస్కూల్ వద్ద మంగళవారం జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మామడలోని నల్దుర్తి గ్రామానికి చెందిన కొత్తపల్లి ఉదయ్ (22) నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు దగ్గర వ్యక్తిగత సహాయకుడిగా పని చేస్తున్నాడు. ఉదయ్ మంగళవారం సొంత గ్రామమైన నల్దుర్తికి వచ్చి తిరిగి బైక్‌పై నిర్మల్ వెళ్తుండగా నిర్మల్ నుంచి ఖానాపూర్ వైపు వెళ్తున్న లారీ కనకాపూర్‌లోని అక్షర హైస్కూల్ వద్ద ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉదయ్ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలిసిన శ్రీహరిరావు హైదరాబాద్ నుంచి బయలుదేరారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

కడెం, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షాక్‌తో ఓ యువకుడి మృతిచెందాడు. మండలంలోని కన్నాపూర్ శివారులో గల జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న పొలంలో మంగళవారం ఉదయం సంగెం రాజేందర్ (36) గడ్డి కోస్తుండగా దగ్గరలో గల మోటార్ వైర్లు గడ్డి మిషన్‌కు చుట్టుకొని విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు.

గంజాయి సాగు చేస్తే చర్యలు : ఎస్సై

నేరడిగొండ, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): మక్కా పంటలో అంతర పంటగా గంజాయి సాగుచేస్తున్న మహిళపై కేసు నమోదు చేసి, ఆమెను అరెస్టు చేసినట్లు మంగళవారం ఎస్సై ఇమ్రాన్ తెలిపారు. నేరడిగొండ మండలంలోని గాజిలి గ్రామశివారులో ఆదే గ్రామానికి చెందిన సీతాబాయి అనే మహిళ తన మక్కా పంట పొలంలో అక్రమంగా ఏడు గంజాయి మొక్కలను సాగు చేస్తున్నట్లు సమాచారం అందగా సదరు మహిళ పంట పొలాన్ని పరిశీలించగా మక్క పంటలో అంతర పంటగా గంజాయిని సాగు చేస్తున్నట్లు చెప్పారు. గంజాయి మొక్కలను స్వాధీనం పరుచుకున్నట్లు పేర్కొన్నారు. అక్రమంగా ఎవరైనా గంజాయి సాగు చేసిన, అమ్మిన వారిపై చట్టరీత్యా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

విగ్రహ ప్రతిష్ఠాపనపై ఇరువురి మధ్య వాగ్వాదం

సారంగాపూర్, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): మండలంలో మహాప్రసిద్ధి గాంచిన అడెల్లి పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్టాపనపై అడెల్లి ఆలయ పరిసరాల్లో మంగళవారం ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు పాలక మండలి సభ్యులు సమాశేశమై అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన విషయంపై చర్చించే సమయంలో ఇరువురి మధ్య వాగ్వాదానికి దారితీసింది. దీంతో ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని సమస్యను పరిష్కంచడంతో వాగ్వాదం సద్దుమనిగింది.

పశువుల కొట్టాలు దగ్ధం

భీంపూర్, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిప్పల్ కోటిలో మంగళవారం మధ్యాహ్నం మార్చెట్టి వెంకటి, ఎయిటి రామదాసు అనే రైతుల ఎడ్ల కొట్టలు ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. స్థానికులు మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించిన అదుపులోకి రాలేదు.

ఏటీఎంలో చోరీకి యత్నం

ఆదిలాబాద్‌టౌన్, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఏటీఎంలో ఓ వ్యక్తి చోరీకి యత్నించడం కలకలం రేపింది. పట్టణంలోని కిసాన్‌చౌక్ ఏరియాలోని ఓ లాడ్జ్ కింద ఉన్న డీబీఎస్ ఏటీఎంలోకి దొంగ చొరబడ్డాడు. గడ్డ పారతో ఏటీఎం మిషన్‌ను ధ్వంసం చేసి లాకర్‌ను పగలగోట్టేందుకు ప్రయత్నించాడు. ఇదే సమయంలో అలారం మోగడంతో అక్కడి నుంచి పారిపోయాడు. పోలీసులు అప్రమత్తమై ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. పారిపోయిన దొంగను రైల్వే స్టేషన్ సమీపంలో పట్టుకున్నట్లు సమాచారం. పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపడుతున్నారు.



మంత్రి లక్ష్మణ్‌కుమార్‌ను కలిసిన ఎమ్మెల్యే బొజ్జుపటేల్

మైనార్టీ పాఠశాలలకు భవనాలు మంజూరు చేయాలి

ఉట్నూర్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఖానాపూర్ నియోజకవర్గంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళశాలలకు పక్క భవనాలు మంజూరు చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మైనార్టీ వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ అబ్దుల్లా కొత్వాల్‌తో కలిసి మంత్రిని కలవడం జరిగిందని తెలిపారు. నియోజక వర్గంలోని ఉట్నూర్, ఖానాపూర్‌లలో మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల భవనాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి పాఠశాల భవనాలను మంజూరు చేయడానికి తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే బొజ్జుపటేల్ వివరించారు.

ఆత్మహత్య.. ఆలోచనే వద్దు!

...జీవితం ఎంతో విలువైనది



- క్షణికావేశంలో తీవ్ర నిర్ణయాలు
- రోడ్డున పడుతున్న కుటుంబాలు
- అనాథలవుతున్న పిల్లలు
- నిత్యం పెరుగుతున్న బలవన్మరణాలు
- నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం

ఆదిలాబాద్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) / కడెం: భార్య కాపురానికి రావడం లేదని భర్త.. టెన్త్, ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయ్యాయని మనస్థాపంలో విద్యార్థులు, అత్తమామలు, భర్త వేధింపులకు గురి చేస్తున్నారంటూ వివాహిత.. పెళ్లికి ఒప్పుకోలేదని ప్రేమికకులు.. భార్యభర్తల మధ్య తలెత్తిన మనస్పార్థాల కారణంగా గృహిణి ఇలా పలు కారణాలతో తనువు చాలిస్తున్న ఘటనలు జిల్లాలో నిత్యకృత్యంగా మారాయి. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాల ఫలితంగా ఆత్మహత్యలకు పాల్పడిన అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నారు. దీంతో వారి పిల్లలు అనాథలవుతున్నారు.

కుటుంబాలు చిన్నాభిన్నం

క్షణికావేశంలో జరుగతున్న ఘటనలతో కుటుంబాలు చిన్నభిన్నమై రోడ్డున పడుతున్నాయి,. ఆవేశంలో తీసుకుంటున్న నిర్ణయాల వల్ల నిండు ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. నిండు నూరేళ్ల బతకాల్సిన వారు క్షణికావేశ నిర్ణయాల వల్ల శవాలుగా మారి కుటుంబాలను శోక సముద్రంలో ముంచెస్తున్నాయి. ఆర్థికంగా కుంగిపోయి అప్పుల బాధలు భరించలేక ఇతర ఇబ్బందులతో చేసుకుంటున్న ఆత్మహత్యలు వారి పిల్లల పాలిట శాపంగా మారుతున్నాయి.

ఆదిలాబాద్ జిల్లాలో పలు ఘనటలు

దీనిలో భాగంగా జిల్లాలో ఇటీవల పలువురు క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకున్న ఘటనలు ఉన్నాయి. బోరజ్ మండలం గూడ గ్రామానికి చెందిన కర్ల నారాయణ(58) అనే రైతు పత్తి పంట దిగుబడి రాదన్న బెంగతో ఇటీవల పశువుల పాకలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

అలాగే, నేరడిగొండ మండలంలోని కుమారి గ్రామానికి చెందిన పోతగంటి లస్మన్న (37) ఖరీఫ్‌లో పంటల సాగుకు చేసిన అప్పులతో పాటు భారీ వర్షాలతో పంట నీట మునగడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరేసుకుని బలవన్మరణానికి ఒడిగట్టాడు.

అలాగే, బజార్‌హత్నూర్ మండల కేం ద్రానికి చెందిన తరుణ్ అనే యువకుడు తన అనారోగ్యం సరిగా లేని కారణంగా కలత చెంది క్షణికావేశంలో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు

ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవాలి

: డాక్టర్ సాధన డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఆదిలాబాద్



కష్టకాలంలో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొవాలి. భయపడి ఆత్మహత్యలకు పాల్పడవద్దు. జీవితం ఎంతో విలువైనది. ఒకే విసయాన్ని పదేపదే ఆలోచించవద్దు. ఏమైనా ఇబ్బందులు కష్టాలు వస్తే ఇతరులతో పంచుకోవాలి. క్షణం ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. మానసికమైన ఇబ్బందులు ఉంటే వైద్యుని సంప్రదించి తగు సలహాలు సూచనలు తీసుకోవాలి.

ఆత్మహత్య చేసుకోవడం.. పరిష్కారం కాదు

: ఎల్.జీవన్‌రెడ్డి, డీఎస్పీ ఆదిలాబాద్



క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకోవడం సరైంది కాదు. ఆత్మహత్యలు చేసుకుంటే సమస్యలు పరిష్కారం కావు. సమస్యల పరిష్కారానికి ఎన్నో మార్గాలు ఉన్నాయి. ముఖ్యంగా మహిళలకు సఖీ, భరోసా కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. సున్నితమనస్తత్వం కలిగిన వారి పై తల్లిదండ్రులు ప్రత్యేకంగా దృష్టి సారించాలి. ఎంత పెద్ద సమస్య వచ్చిన ఇతరులతో చర్చించి పరిష్కరించుకోవాలి.

ఆశావహ దృక్పథంతో ముందుకు సాగాలి

: కొమరవెల్లి భూమేష్, జేజేఎస్ ఫౌండర్, కడెం



సమస్య వచ్చినప్పుడు, అపజయాలు కలిగినప్పుడు కృంగిపోవద్దు. ఆత్మహత్యలకు పాల్పడకుండా అఖండమైన ధైర్యంతో, ఆశావహ దృక్పథంతో మళ్లీ మళ్లీ ప్రయత్నిస్తూ ముందుకు సాగాలి. అంతే దగ్గరలో పరిష్కార మార్గాలు పొందవచ్చు. ప్రతీ మనిషి జీవితంలో వచ్చే ప్రతీ సమస్యపై పోరాడుతూ ఉండాలి. అందుకు పంచ భూతాలే ప్రతీ వ్యక్తికి ఆదర్శం. జీవితం ఒక పోరాటం.



స్వయం సహాయక సంఘాల సభ్యులకు నాటుకోడి పిల్లలను అందిస్తున్న ఏపీఎం చంద్రశేఖర్

పెరటి కోళ్ల పెంపకం ద్వారా స్వయం సహాయక సంఘాలకు ఉపాధి

తలమడుగు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మహిళా సహాయ సంఘాల సభ్యులను ఆర్థికంగా అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం వారికి పెరటి కోళ్ల పెంపకం ద్వారా జీవన ఉపాధి కల్పిస్తుందని ఐకెపి ఎపిఎం చంద్రశేఖర్ కోరారు. మంగళవారం తలమడుగు మండలంలో 64 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు 1088 పెరటి నాటు కోళ్ల కోడి పిల్లలను చంద్రశేఖర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ మహిళలను ఆర్థికంగా అభివృద్ధిపరిచేందుకు ప్రభుత్వం మహిళ శక్తి పథకం ద్వారా ఆర్థిక రుణాలను అందిస్తుందన్నారు. ఇందులో భాగంగా తలమడుగు మండలంలో ఒక్కొక్క స్వయం సహాయక సంఘ సభ్యురాలకు రెండు వేల రూపాయల చొప్పున 17 నుంచి 20 కోడి పిల్లలను అందిస్తున్నామన్నారు. ఇందులో వసుందర మండల సంఘం అధ్యక్షురాలు ప్రమీల, కోశాధికారి సోంబాయి, ఐకెపి సీసీలు సమత, ఆనంద్ రెడ్డి. రమేష్, స్వామి, మోహన్, ఐకెపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'బీమా కుటుంబాన్ని ఆదుకుంటుంది'

నేరడిగొండ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జీవిత బీమా కుటుంబాన్ని ఆదుకుంటుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మంగళవారం బజార్‌హత్నూర్ మండల కేంద్రానికి చెందిన పసుపుల గంగయ్య ఇటీవల మృతి చెందగా వచ్చిన ఇన్సూరెన్స్ పాలసీ చెక్కును మంగళవారం వారి నామిని భార్య పసుపుల సాయవ్వకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చేతుల మీదుగా బీమా చెక్కులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వయిజర్, తదితరులు ఉన్నారు.

'న్యాయవాదులపై దాడిని ఖండిస్తున్నాం'

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): న్యాయవాదులపై దాడులు పునరావృతం కాకుండా రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్రాల నగేష్ డిమాండ్ చేశారు. ఓ కేసు విషయంలో ఎన్‌బీడబ్ల్యూ నోటిసులు ఇవ్వడానికి వెళ్లిన ఆదిలాబాద్ న్యాయవాదులు కౌషిక్ సింగ్, మనోజ్ లపై నిందితులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఘటనను ఖండిస్తూ మంగళవారం విధులు బహిష్కరించి జిల్లా న్యాయస్థానం ఎదుట నిరసన తెలిపారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్రాల నగేష్ మాట్లాడుతూ..... న్యాయవాదులపై ఎక్కడో ఓ చోట వరసగా దాడులు జరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ధర్నాలో న్యాయవాదులు కేమ శ్రీకాంత్, లోక ప్రవీణ్ రెడ్డి, భావన సింగ్, మహేష్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

'మహాసభలను జయప్రదం చేయండి'

ఉట్నూర్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల రెండవ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆశన్న కోరారు. మంగళవారం మండలంలోని శ్యాంపూర్ గ్రామ భవన నిర్మాణ కార్మికులు బుధవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహిస్తున్న భవన నిర్మాణ మరియునిర్మాణ రంగ కార్మికుల యూనియన్ జిల్లా 2వ మహాసభలకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జు ఆశన్న అన్నారు. ఈ కార్యక్రమంలో శ్యాంపూర్ గ్రామ భవన నిర్మాణ కార్మికులు సంజీవ్, శిరాజ్, రాజేశ్వర్, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

న్యూ నలందలో స్వయంపాలన దినోత్సవం

ఉట్నూర్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి):మండలంలోని లింగోజితండలోని న్యూనలంద పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకిని విద్యార్థులు స్వయంపాలన దినోత్సవం జరుపుకున్నారు. చిన్నారులు ఉపాధ్యాయులుగా మారి తమ తోటి విద్యార్థులకు పాఠాలు బోధించడం ఆకర్షించింది. ఈ సందర్భంగా పాఠశాల కు చెందిన టీచర్ రాథోడ్ ఉమాదేవి బెస్ట్ టీచర్ అందుకోవడంతో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జాదవ్ గణపతి, కరెస్పాండంట్ జాదవ్ వసంత్ రావు, ఉపాధ్యాయులు మౌనిక, భాగ్యశ్రీ, ప్రియ, అయేషా, సుప్రియ సంజీవ్, వినయ్, సేవాదాస్, హన్మంత్ రావు తదితరులు పాల్గొనారు.

ఒక్క సీసీ కెమెరా వంద పోలీసులతో సమానం

- నిఘా నీడలో ఉట్నూర్, ఇంద్రవెల్లి మండల కేంద్రాలు

ఉట్నూర్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా, ఏఎస్పీ ఉట్నూర్ కాజల్‌సింగ్‌లతో కలిసి మంగళవారం ప్రారంభించారు. 30 రోజుల బ్యాక్‌అప్‌తో ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలోకి తేవడం జరిగిందన్నారు. నిష్ణాతులైన సిబ్బందితో 24గంటలు పర్యవేక్షణ నిర్వహిస్తామన్నారు. నేరాల నియంత్రణ, నేరాలను అరికట్టడానికి ఉట్నూర్, ఇంద్రవెల్లి మండల కేంద్రాలలో 50 సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఒక కెమెరా 100 మంది పోలీసుతో సమానంగా విధులను నిర్వర్తిస్తుందని ఎలాంటి సమస్యలకైనా చేదించేందుకు వీలుగా సీసీటీవీ కెమెరాలు ఉపయోగపడతాయని ఎస్పీ అన్నారు. ఉట్నూర్‌లో ప్రారంభించిన కమాండ్ కంట్రోల్స్ సెంటర్‌లో 37 సీసీ టీవీ కెమెరాలు, ఇంద్రవెల్లిలో 13 సీసీటీవీ కెమెరాలతో ప్రధానమైన కూడళ్లను సీసీటీవీ నిఘా నేత్రంలో ఉండి, నిష్ణాతులైన సిబ్బందిచే 24 గంటలు పర్యవేక్షించడం జరుగుతుందని అన్నారు. సీసీ కెమెరాలు ఆధునాతన టెక్నాలజిని సాంకేతికతను కలిగి ఉన్నాయని రాత్రి సమయంలో పగటి సమయంలో తేడా లేకుండా సరైన స్పష్టమైన దృశ్యాలను చూపిస్తాయన్నారు. 30 రోజుల బ్యాక్‌అప్‌తో కలిగిన వాటిని ఈ రోజు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ము ఖ్యంగా ఈ సీసీటీవీ కెమెరాలకు సహకరించిన ఐటీడీఏ పీవోకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఆదివాసుల ఖిల్లా ఉండేటువంటి ఉట్నూర్, ఇంద్రవెల్లిలో ఎలాంటి నేరాలకు అస్కారం లేకుండా నేరస్థులను త్వరితగతిన పట్టుకునేందుకు మరియు దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు కారకులను గుర్తించడంలో ఈ సీసీ టీవీ కెమెరాలు తమవంతు కీలక పాత్ర పోషిస్తూ కేసు చేతనలో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ సీఐ మడావి ప్రసాద్, నార్నూర్ సీఐ పి.ప్రభాకర్, ఎస్సైలు కె.ప్రవీణ్, అఖిల్, మనోహార్, పోలీసు స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఎస్పీ, పీవో, ఏఎస్పీలు (ఇన్‌సెట్‌లో పట్టణంలోని సీసీ టీవీ దృశ్యాలు



ఇంద్రవెల్లిలో కాళోజీకి నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో జీవన్‌రెడ్డి



నేరడిగొండ మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ పీవో స్వామి



బజార్ హత్నూర్‌లోని జూనియర్ కళాశాలలో కాళోజీ జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

జిల్లాలో కాళోజీ జయంతి

ఆదిలాబాద్‌లో జిల్లాలోని ఉట్నూర్, తాంసి, ఇంద్రవెల్లి, నేరడిగొండ, గుడిహత్నూర్, బజార్ హత్నూర్, సిరికొండతో పాటు తదితర మండలాల్లో మంగళవారం ప్రజాకవి కాళోజి జయంతిని పురస్కరించుకుని తెలంగాణ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాళోజీ గొప్పతనాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, నాయకులు, విద్యార్థులు, యువజన సంఘాలు, స్వచ్ఛంద కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి

- బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే

నేరడిగొండ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి కోసం కృషి చేస్తున్నట్లు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో గల మినిస్టర్ క్వార్టర్స్‌లో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమం శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవలే నియోజకవర్గానికి నిధులు మంజూరు చేసినందుకు నియోజకవర్గ ప్రజల తరపున ఆయన ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. అంతేకాకుండా నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన రాష్ట మంత్రి త్వరలో మరిన్ని నిధులు మంజూరుకు సహకరిస్తా అని తెలిపారు. ఆయన వెంట నాయకులు బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతరెడ్డి, యువ నాయకులు ఎండీ సద్దాం, మౌలానా, తదితరులు ఉన్నారు.

త్వరలోనే బరంపూర్‌లో కొమురం భీం విగ్రహం ఏర్పాటు

తలమడుగు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బరంపూర్ గ్రామంలో త్వరలోనే కొమరం భీం విగ్రహం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆదివాసి జిల్లా నాయకుడు కుమ్ర జ్ఞానేశ్వర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్ జంగల్ జమిని కోసం ఆదివాసుల అభివృద్ధి కోసం పోరాటం చేసిన అమరజీవి కొమరం భీం విగ్రహం ఏర్పాటుకు బరంపూర్ గ్రామస్తులతో చర్చించడం జరిగిందన్నారు. కుమ్రం భీం విగ్రహ నిర్మాణానికి స్థలం చుపాలని, గ్రామ పెద్దలు ముడుపు కేదేశ్వర్ రెడ్డి గ్రామ పంచాయతీ కార్యదర్శి కలవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ సంఘం నాయకులు మరియూ సర్ మేడి, మరియూ పటేల్‌లు కలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కుమ్ర జ్ఞానేశ్వర్, జంగాల పొచన్న, గోడం భుజంగరావు. నీలగిరి అశోక్.సిడాం మాధవ్. మేశ్రం శంభు, పెండోర్ జైతు, గేడం గోవిందరావు, మాజీ సర్పంచ్ ఆత్రం ప్రభాకర్, కుమ్ర శంకర్. కాత్లే రాంచందర్, మెశ్రామ్ నాగేష్ పాల్గొన్నారు.

'ఆదివాసీ గూడెలకు అందని అభివృద్ధి'

బోథ్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత అభివృద్ధి ఆదివాసి గూడేలకు అందకుండా పోయాయని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మహదుగూడ, కేశవ్‌గూడ, పార్డీకే, పార్డీ బి, గన్ పూర్, డివిటి గ్రామాలలో కొమరం భీమ్ విగ్రహాల ప్రతిష్టాపన కోసం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గిరిజన గూడెం అభివృద్ధిలో వెనుకబడ్డాయన్నారు. ఆదివాసులలో కొన్ని వర్గాలకు మాత్రమే ఈ ప్రభుత్వం న్యాయం చేస్తుందన్నారు. సంక్షేమ పథకాలు అన్ని వర్గాలకు అందాల్సి ఉందని పేర్కొన్నారు. మన హక్కులకు భంగం కలిగితే కొమరం భీమ్ స్ఫూర్తితో నిలదీద్దామని అన్నారు. ఆయన వెంట మాజీ సర్పంచులు శ్రీధర్ రెడ్డి, సురేందర్ యాదవ్, దేవేందర్, తదితరులున్నారు.

సీసీఐ పై సానుకూల స్పందన హర్షణీయం

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): సీసీఐని తెరిపించాలని గత మూడేళ్ల కాలంగా సీసీఐ సాధన కమిటీ నిర్విరామంగా పోరాటం చేస్తున్న ఫలితమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో కదలిక వచ్చిందని కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేష్ అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఏప్రిల్ మాసంలో ఢిల్లీకి వెళ్లి కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి కుమార స్వామీని కలిశామని తెలిపారు. హైదరాబాద్‌లో ఇటీవల ఏర్పాటు చేసిన సమావేశంలో సీసీఐ సీఎండి, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని సీసీఐ పునఃప్రారంభం పట్ల సానుకూలంగా స్పందించడాన్ని స్వాగతిస్తున్నమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సీసీఐని ప్రభుత్వ సంస్థగానే కొనసాగించాలని కోరడాన్ని స్వాగతిస్తున్నామన్నారు.

ఆగని.. అక్రమ దందా

(5వ పేజీ తరువాయి...)

అంటగడుతున్నారు. అలాగే ఇంటి వరకు ఫ్రీ డెలివరీ కావడంతో ఖర్చు భారం తగ్గుతుందన్న ఉద్దేశంతో ఆర్డర్లు ఇస్తున్నారు. కానీ ఇదంతా అక్రమ దందా అని తెలిసినా అధికారులు అడ్డుచెప్పక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తనిఖీలు నిల్

జిల్లా సరిహద్దుల్లో ఉన్న బేల శంకర్‌గూడ, తలమడుగు మండలం లక్ష్మీపూర్, బోథ్ మండలం గన్‌పూర్, జైనథ్ మండలం బోరజ్ వద్ద తనిఖీ కేంద్రాలు ఉన్న యథేచ్ఛగా అక్రమ దందా కొనసాగుతుంది. వ్యాపారులు ఇస్తున్న నెల నెలా మాముళ్లతోనే చెక్‌పోస్టు అధికారులు సరిపెట్టుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. చెక్‌పోస్టు అధికారులతో రహస్య సంబంధాలను పెట్టుకుంటున్న వ్యాపారులు అడ్డగోలు దందాలకు ఎగబడుతున్నారు. సరిహద్దు చెక్‌పోస్టుల్లో సరైన నిఘా లేకపోవడంతోనే జిల్లాలో అక్రమ వ్యాపారాలు కొనసాగుతున్నాయి. అధికారులు సక్రమంగా తనిఖీలు చేస్తే అక్రమ దందాలకు అడ్డుకట్టపడే అవకాశం ఉంటుంది. కానీ చెక్‌పోస్టు అధికారుల నిర్లక్ష్యంతోనే అక్రమ మద్యం, స్టీల్, సిమెంట్, పలు రకాల జీరో వ్యాపారం కొనసాగుతుంది.

నిబంధనలకు విరుద్ధంగా..

కొందరు వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా అమ్మకా లు జరుపడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుంది. జిల్లాలో నిత్యం కోట్ల రూపాయల వ్యాపార లావాదేవీలు కొనసాగుతున్న అంతంత మాత్రంగానే ఆదాయం వస్తున్నట్లు తెలుస్తుంది. నిబంధనల ప్రకారం సిమెంట్ అమ్మకాల పై 28 శాతం, స్టీల్ అమ్మకాలపై 18శాతం జీఎస్టీని చెల్లించా ల్సి ఉంటుంది. ఇందులో సిమెంట్‌పై కేంద్రానికి 14 శాతం మరో 14 శాతం రాష్ట్ర ప్రభుత్వానికి జీఎస్టీ పన్నుల రూపంలో వెళ్తుంది. అలాగే స్టీల్‌పై కేంద్రానికి 9 శాతం, రాష్ట్రానికి మరో 9శాతం జీఎస్టీని చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఇదేమీ పట్టించుకోకుండా కొందరు వ్యాపారులు జీరో దందాకు ఎగబడుతున్నారు. క్వింటాల్ స్టీల్‌పై రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు తగ్గిస్తూ అమ్మేస్తున్నారు. అలాగే ఒక్కో సిమెంట్ బ్యాగుపై రూ.30 నుంచి రూ.50 వరకు ధరలను తగ్గిస్తున్న ట్లు తెలుస్తుంది. మహారాష్ట్ర వ్యాపారుల దూకుడుతో స్థానిక వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు. జీఎస్టీని ఎగవేస్తూ హోల్‌సెల్‌గా విక్రయాలు జరుపడంతో వినియోగదారులు మహారాష్ట్రకు పరుగులు పెడుతున్నారు.

'పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి'

ఉట్నూర్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రభుత్వం గ్రామ పాలన వ్యవస్థ కుంటుపడినందున వెంటనే గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని మాజీ ఎంపీపీ పంద్రాజయవంతరావు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కన్నాపూర్, ఉమాపతికుంట గ్రామాలను సందర్శించారు. గ్రామాలలో సర్పంచ్‌లు లేక పోవడం వల పారిశుద్య కార్యక్రమాలు అస్తవ్యస్థంగా ఉన్నాయని, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల సైతం పంచాయతీల అభివృద్ధికి నిధులు సక్రమంగానిదులు ఇవ్వక పోవడంతో ఆదివాసీ గ్రామాలు అపరిశుభ్రతకు నిలయాలుగా మారి గిరిజన గ్రామాల ప్రజలు అంటు వ్యాధుల భారీన పడే అవకాశాలు ఉన్నాయన్నారు.

అవకాశాలు అందిపుచ్చుకుంటే ఉజ్వల భవిష్యత్తు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): యువతకు సైన్యంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని, ఆసక్తిని బట్టి నైపుణ్యాలను మెరుగు పరుచుకుంటే ఉజ్వల భవిత సొంతమని కెప్టెన్ గాలి అశోక్ తెలిపారు. పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో డిగ్రీ విద్యార్థులకు ఎన్‌సీసీ ఎన్‌రోల్‌మెంట్ సిగ్రేడ్ పరీక్షలను మంగళవారం నిర్వహించారు. అగ్నివీర్ సంబంధించిన ఎంపిక ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

గణనాథుడికి ఘన వీడ్కోలు


నియోజకవర్గ కేంద్రమైన బోథ్‌లో సోమవారం సాయంత్రం వివిధ మండపాలలో నుండి గణనాథల నిమజ్జన కార్యక్రమం భక్తి శ్రద్ధలతో కొనసాగింది. ప్రధాన వీదుల గుండా కొనసాగిన శోభాయాత్ర మంగళవారం ఉదయం 8 గంటలకు పట్టణం సమీపంలోని కరత్వాడ ప్రాజెక్టు వద్దకు చేరుకుంది. ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో బోథ్, ఆదిలాబాద్ రూరల్ సీఐలు వెంకటేశ్వరరావు, ఫణిందర్‌లు తమ సిబ్బందితో పర్యవేక్షించారు. దీంతో నిమజ్జనం ప్రశాంతంగా ముగిసింది.



కరత్వాడ ప్రాజెక్టు వద్ద నిమజ్జనం చేస్తున్న యువకులు



బోథ్‌లో మిత్ర గణేష్ మండలి వద్ద ఆదిలాబాద్ డీఎస్పీ, పోలీసులు





● ఓటు వేసేందుకు ఇతర ఎంపీలతో కలిసి క్యూలైన్‌లో నిలబడిన ఎంపీ గోడం నగేష్

ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేసిన ఎంపీ

ఆదిలాబాద్, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గోడం నగేష్ పాల్గొన్నారు. మంగళవారం పార్లమెంట్ భవన్‌లో నిర్వహించిన ఎన్నికల్లో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పాల్గొని ఓటు వేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

రేపు జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి రాక



ఉట్నూర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, టూరిజం, కల్చర్ అండ్ ఆర్కాలజి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం జిల్లా పర్యటనకు వస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. గురువారం ఉదయం 9గంటలకు బోథ్ మండల కేంద్రానికి చేరుకుని ఇందిరమ్మ మోడల్ హౌజ్‌ను ప్రారంభిస్తారు. బోథ్‌లో అధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని సంక్షేమ కార్యక్రమాల పథకాలను పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు చేరుకుని ఇంద్రవెల్లి స్తూపం వద్ద ప్రారంభోత్సవాలు నిర్వహిస్తారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు. అక్కడి నుంచి జిల్లా కేంద్రంలోని పెన్‌గంగా గెస్ట్‌హౌజ్‌కు చేరుకుని కొద్దిసేపు విశ్రాంతి పొందిన అనంతరం బోరజ్ మండలంలోని పిప్పర్‌వాడ చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడి నుంచి గిమ్మ గ్రామానికి రూ.13.78 కోట్లతో ఆదిలాబాద్ నియోజక వర్గానికి మంజూరైన సీసీ రోడ్ల పనులను ప్రారంభిస్తారు. అనంతరం జిల్లా కేంద్రంలోని గాయత్రి గార్డెన్‌లో జరిగే పంపిణీ కార్యక్రమంలో పాల్గొని అనంతరం కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం సమీక్ష సమావేశం అనంతరం రాజధానికి బయలుదేరుతారని అధికార వర్గాలు వివరించాయి.



వాట్సాప్ చాట్‌బాట్‌తో సేవలు

జేఆర్ చౌహాన్, విద్యుత్ శాఖ ఎస్ఈ, ఆదిలాబాద్

ప్రశ్న: విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి సేవలను అందిస్తున్నారు?

జవాబు: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వినియోగదారులకు మెరుగైన సేవలను అంది స్తున్నాం. ప్రస్తుతం వాట్సాప్ చాట్‌బాట్ ద్వారా వినియోగదారులు విద్యుత్‌కు సంబంధించిన ఫిర్యాదు, సేవలను పొందవచ్చు.

ప్ర: వర్షాకాలంలో ఐరన్‌పోల్స్‌తో జరిగే ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నారా?

జ: వర్షాకాలంలో ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. పాత ఐరన్ పోల్స్‌కి 50 సెంబర్స్, ఇన్సూలేటెడ్ పీవీసీ పైపుని అమర్చి విద్యుత్ షాక్‌కు గురికాకుండా చర్యలు చేపడుతున్నాం.

ప్ర: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో ఏ మేరకు నష్టం వాటిల్లింది?

జ: జిల్లాలో ఇటీవల భారీ వర్షాలతో విద్యుత్ శాఖకు రూ.20 లక్షల వరకు నష్టం జరిగింది. వెంటనే మరమ్మతులను చేపట్టి విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాం. వరద బీభత్సంతో పాటు పిడుగులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రాత్రీపగలు సిబ్బంది విధుల్లోనే ఉంటున్నారు.

ప్ర: సకాలంలో కనెక్షన్‌లను మంజూరు చేస్తున్నారా?

జ: దరఖాస్తు చేసుకున్న వెంటనే పరిశీలించి మంజూరు చేస్తున్నాం. ముఖ్యంగా హెచ్‌డీ సర్వీసుల మంజూరుకు సింగిల్ విండో వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చాం. 11 కేవీ, 33 కేవీ, ఆ పై హోల్టేజ్ సర్వీసుల మంజూరు వేగవంతంగా జరుగుతుంది.

ప్ర: విద్యుత్ చౌర్యాన్ని ఎలా అరికడుతున్నారు?

జ: ముఖ్యంగా రాత్రి వేళల్లో కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు జంతువులను వేటాడేందుకు వైర్లను వేలాడదీసి విద్యుత్‌ను వినియోగిస్తున్నట్లు తెలుస్తుంది. దీంతో తరుచు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. ఇలాంటి వారిపై క్రిమినల్ కేసులను నమోదు చేస్తున్నాం.

- ఆదిలాబాద్, ఆంధ్రజ్యోతి

ఆగని.. అక్రమ దందా



● మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం

మహారాష్ట్ర నుంచి.. జిల్లాకు అక్రమంగా స్టీల్, సిమెంట్‌ను తరలిస్తూ అడ్డగోలుగా అమ్మేసుకుంటున్నారు. అధికారుల తనిఖీల్లో తరచూ పట్టుబడుతున్న అక్రమ దందాకు అడ్డుకట్ట పడడం లేదు. జిల్లా కేంద్రంతో పాటు మహారాష్ట్ర సరిహద్దు మండలాల్లో జోరుగా జీరో దందా సాగుతోంది. ఇంత జరుగుతున్నా.. వాణిజ్య పన్నుల శాఖ అధికారులు తమకేవీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఏదైనా ఫిర్యాదు వస్తేనే హడావిడి చేయడం, ఆ తర్వాత అంతా మాములుగానే మారిపోతుంది.

- జిల్లాలో జోరుగా స్టీల్, సిమెంట్ జీరో వ్యాపారం
- మహారాష్ట్ర పాటన్‌బోరీ నుంచి యథేచ్ఛగా సరఫరా
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో పెరిగిన డిమాండ్
- సరిహద్దు చెక్‌పోస్టుల్లో తనిఖీల కరువు
- ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న 'మహా' వ్యాపారులు
- తేలికగా తీసుకుంటున్న వాణిజ్య పన్నుల శాఖ అధికారులు

ఆదిలాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మంగళవారం విద్యానగర్‌లో ఓ ఇంటి నిర్మాణానికి మహారాష్ట్ర పాటన్‌బోరి నుంచి స్టీల్, సిమెంట్‌ను తరలించారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయగా 16 టన్నులకు సంబంధించిన బిల్స్ ఉన్నాయంటూ అధికారులు సమాధానం ఇచ్చారు. కానీ ఇందులో 25 నుంచి 30 టన్నుల స్టీల్ ఉన్నట్లు తెలుస్తుంది. తూకం వేసి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అవేమి పట్టించుకోకుండా వదిలేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్లతో పాటు పలు రకాల నిర్మాణాల పనులు ఊపందుకోవడంతో స్టీల్, సిమెంట్‌కు భారీగా డిమాండ్ కనిపిస్తుంది. దీంతో అడ్డదారుల్లో చౌకధరలకు కొనుగోలు చేసేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. నేరుగా ఇంటి నిర్మాణం వద్దకే స్టీల్, సిమెంట్‌ను తరలిస్తూ సోమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినా తెలియనట్లుగానే వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. స్థానిక వ్యాపారులు అధికారులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. మహారాష్ట్ర వ్యాపారులతో కొంత మంది అధికారులు కుమ్మక్కై అక్రమ దందాకు తెరలేపుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు లేవు

: గంగామణి, సీటీవో, ఆదిలాబాద్

జిల్లా సరిహద్దుల్లో వాణిజ్య పన్నుల శాఖకు సంబంధించి న చెక్‌పోస్టులు లేవు. దీంతో అక్రమంగా జిల్లాకు తరలిస్తున్న స్టీల్, సిమెంట్, ఇతర వ్యాపారాలను అడ్డుకోవడం కష్టంగా మారింది. మహారాష్ట్ర నుంచి జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌కు తరలించిన స్టీల్ విషయం మా దృష్టికి రాలేదు. ఫిర్యాదు వస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార కార్యకలాపాలను కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయి.

ఇందిరమ్మతో పెరిగిన గిరాకీ

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ఊపందుకోవడంతో స్టీల్, సిమెంట్‌కు భారీగా డిమాండ్ ఏర్పడుతుంది. దీంతో నిర్మాణ సామగ్రి ధరలు భగ్గుమంటున్నాయి. అయితే పక్కనే ఉన్న మహారాష్ట్ర నుంచి స్టీల్, సిమెంట్‌ను కొనుగోలు చేస్తున్నారు. మహారాష్ట్రలోని పాటన్‌బోరీకి చెందిన ఓ బడావ్యాపారి జిల్లాలో యథేచ్ఛగా జీరో వ్యాపారం కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రంతో పాటు బేల, జైనథ్, తలమడుగు, తాంసి, భీంపూర్, బోథ్ మండలాలకు అడ్డగోలుగా ఇంటి నిర్మాణ సామగ్రిని సరఫరా చేస్తున్నారు. రాత్రీపగలు అనే తేడా లేకుండా భారీ వాహనాలలో ఆర్డర్‌లపై సిమెంట్, స్టీల్‌ను తరలిస్తున్నారు. ఎలాంటి బిల్లులు, అనుమతులు లేకుండానే అడ్డగోలు దందాకు ఎగబడుతున్నారు. ఇంటి నిర్మాణం చేపడుతున్న యజమానులు నేరుగా పాటన్‌బోరీ వెళ్తూ నిర్మాణ సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు. ధరల్లో భారీగా తేడాలు ఉన్నాయంటూ మహారాష్ట్రకు పరుగులు తీస్తున్నారు. అయితే వ్యాపారులు తూకంలో మోసం చేస్తూ.. స్టీల్‌ను



అమ్మేందుకు సిద్ధంగా ఉంచిన స్టీల్

(తరువాయి 7వ పేజీలో....)



ఎస్పీని సన్మానిస్తున్న హిందూ ఉత్సవ సమితి సభ్యులు

ఎస్పీని కలిసిన ఉత్సవ సమితి సభ్యులు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గణేష్ నవరాత్రులు శాంతియుత వాతావరణంలో జరిగేలా జిల్లా పోలీసు యంత్రాంగం అవిశ్రాంత కృషి చేయడం పట్ల ఎస్పీ అఖిల్ మహాజన్‌ను సనాతన హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఎస్పీతో పాటు ఏఎస్పీ సురేందర్ రావు లను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి, ప్రధాన కార్యదర్శి పడకంటి సూర్యకాంత్, కోశాధికారి రేణుకుంట రవీందర్, కార్య నిర్వాహక కార్యదర్శి కందుల రవీందర్, ప్రేమ్‌సింగ్, మహిపాల్, జిన్నావర్ రాజు, బానోత్ కృష్ణ కుమార్ పాల్గొన్నారు.



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

రిమ్స్‌లో కాన్సర్ డే కేర్ సెంటర్

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో క్యాన్సర్ డే కేర్ సెంటర్‌ను మంగళవారం ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహ అన్ని జిల్లా కేంద్రాల్లో వర్చువల్ విధానంలో ప్రారంభించగా రిమ్స్‌లో డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ కార్యక్రమ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి రాజ నరసింహ వర్చువల్ విధానంలో డే కేర్ సెంటర్‌ను ప్రారంభించి వైద్యాధికరులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్ మాట్లాడుతూ... ఐకేఎస్ నుంచి ఇక్కడే కీమో థెరపీ సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. బాధితులు వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

సమాజాన్ని జాగృతం చేసిన కాళోజీ

● కలెక్టర్ రాజర్షి షా ● కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ప్రజా కవికి ఘన నివాళి ● జిల్లావ్యాప్తంగా ఘనంగా జయంతి వేడుకలు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మహనీయుల ఆశయ సాధన దిశగా ప్రతీఒక్కరు పాటు పడాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ప్రజాకవి కాళోజీ నారాయణ రావు జయంతిని పురస్కరించుకుని కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడు, తన కవితల ద్వారా సమాజాన్ని జాగృతం చేసిన మహనీయుడు కాళోజీ అన్నారు. ఆ మహనీయుడిని స్పూర్తిగా తీసుకుంటూ సమాజ అభ్యున్న తి కోసం పాటు పడాలన్నారు. అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో స్రవంతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మరిన్ని వివరాలు 7వ పేజీలో....



కాళోజి జయంతి కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ రాజర్షిషా, అధికారులు



తాంసిలో కాళోజి చిత్రపటానికి పూజలు చేస్తున్న అధికారులు

భగవాన్‌పూర్‌ను సందర్శించిన డీఎంహెచ్‌వో

భీంపూర్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని భగవాన్‌పూర్ గ్రామాన్ని డీఎంహెచ్‌వో నరేందర్‌రాథోడ్, పంచాయతీ రాజ్ ఈఈలు మండపల్లి వాగు దాటి మోటార్ సైకిళ్లపై, కాలినడకన వెళ్లి సందర్శించారు. మహారాష్ట్రకు చెందిన ప్రియాంక అనే గర్భిణి నాలుగు రోజుల కిందట అమ్మగారి గ్రామం అయిన భగవాన్‌పూర్‌కు వచ్చింది. ఈ క్రమంలో ప్రియాంక పురిటి నొప్పులతో బాధ పడగా.. సమాచారం అందిన అంబులెన్స్ 108 వారు రోడ్డు సరిగ్గా లేక మధ్యలోనే ఆగిపోయారు. అదే సమయంలో ప్రియాంకకు సహజ ప్రసవం జరిగి జన్మించిన పాప అప్పుడే మృతి చెందింది. ఈ సంఘటన గురించి సిబ్బందిని విచారణ చేసి డీఎంహెచ్‌వో ఇక్కడ వైద్య సిబ్బంది తప్పులేదు అన్నారు. నిజానికి ప్రియాకం ప్రసవ తేదీ మరో ఇరవై రోజుల వరకు ఉందని ఆమె పరీక్షలు చేయించుకున్న మహారాష్ట్ర ఆసుపత్రి ద్వారా తెలుసుకున్నామన్నారు. ప్రస్తుతం ప్రియాంకకు భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య చికిత్సలు అందజేస్తున్నామన్నారు. కాగా రోడ్డు లేకనే ఈ పరిస్థితి వచ్చిందని డీఎంహెచ్‌వో పేర్కొన్నారు. రోడ్డు ప్రతిపాదనలు ఇప్పటికే పంపామని ఈఈ శివరాం అన్నారు. అంతకు ముందు డీఎంహెచ్‌వో భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. బాలింత ప్రియాంక ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. మండల వైద్యాధికారి నిఖిల్ రాజ్, సిబ్బంది జ్ఞానేశ్వర్, నాయకులు బక్కి కపిల్ యాదవ్, నితిన్, తదితరులు ఉన్నారు.



మండపల్లి వాగును దాటి భగవాన్‌పూర్‌కు వెళుతున్న అధికారులు



గేట్లు ఎత్తడంతో పరవళ్లు తొక్కుతున్న వరద నీరు

భారీవర్షం.. ఉప్పొంగిన వాగులు

● మత్తడి వాగు ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత
● 5,480 క్యూసెక్కుల నీటి విడుదల

తాంసి రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు చెరువులు, పూర్తిగా నిండి పోయాయి. రాత్రి కావడంతో ఎక్కడ ఎంత వర్షం పడిందో ఎవరికి తెలియలేదు. తెల్లవారి లేచి చూసేసరికి పంట పొలాలన్నీ నీళ్లతో నిండిపోయి ఉన్నాయి. మండలంలోని వడ్డాడి గ్రామ సమీపంలో ఉన్న మత్తడి వాగు ప్రాజెక్టు పూర్తిగా నిండిపోయింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 277.50 మీటర్లు కాగా మంగళవారం ఉదయానికి పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంది. అప్రమత్తమైన అధికారులు వెంటనే ఐదు గేట్లు ఎత్తివేసి 5480 క్యూసెక్కుల నీరుని బయటకు వదిలారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 4800 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. మళ్ళీ వర్షం కురిస్తే కనుక తమ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎస్సీ సబ్ ప్లాన్ కింద నిధుల విడుదల

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని కాలనీల అభివృద్ధి పనుల కోసం ఎస్సీ సబ్ ప్లాన్ కింద రూపాయలు రూ.13.78 కోట్లు విడుదల అయినట్లు ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. మురికి కాలువలు, రోడ్లు, ఇతరత్రా అభివృద్ధి పనుల నిమిత్తం ఆయా గ్రామాల నుంచి వచ్చిన వినతుల మేరకు నిధుల విడుదల కోసం ప్రతిపాదనలు పంపగా... జిల్లాకు ఎస్సీ సబ్ ప్లాన్ కింద నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. దీంతో అభివృద్ధి పనులకు మార్గం సుగమం అయిందని వివరించారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారనికి అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

108 అంబులెన్స్ సేవలపై సమీక్ష

తాంసి రూరల్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలో 108 అంబులెన్స్ సేవలను జిల్లా ప్రోగ్రాం మేనేజర్ స్వామ్రాట్, జిల్లా మేనేజర్ రాజశేఖర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు అంబులెన్స్‌లో వైద్య పరికరాల పనితీరు, రిజిస్టర్లు, రికార్డులను సవివరంగా తనిఖీ చేశారు. సమయానికి స్పందించడం, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లో లభ్యత వంటి అంశాలపై సిబ్బందికి సూచనలు అందించారు. గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు సమయానికి మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నందుకు అంబులెన్స్ టీమ్‌ను అభినందించారు. అధికారుల ఈ పర్యటనతో వైద్య సదుపాయాలపై నమ్మకం పెరిగి, అత్యవసర సేవలు మరింత బలోపేతం అవుతాయని భావిస్తున్నారు. అంబులెన్స్ సేవలపై ప్రజల్లో నమ్మకం కలిగిందని ఇలాగే సేవలు మరింత విస్తృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పైలెట్ వంశీ, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ కుడ్మెత మనోహర్


మెరుగైన వైద్య సేవలు అందించాలి

● జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ కుడ్మేత మనోహర్

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ కుడ్మేత మనోహర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఆ తర్వాత ప్రసూతి గది, రక్త పరీక్షల గదితోపాటు ఆరోగ్య కేంద్ర ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం ఆరోగ్య సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ పూజిత, హెల్త్ సూపర్ వైజర్ పవార్ సురేష్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● రోగుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

నేరడిగొండ: ఆసుపత్రికి వచ్చే రోగులతో పాటు గ్రామాలలో అనారోగ్యం బారిన పడ్డ రోగుల వివరాలను క్షేత్రస్థాయిలో పరీక్షించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య కో ఆర్డినేటర్ అజయ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గల స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో అజయ్ పాల్గొని మాట్లాడుతూ ప్రతీ ఒక క్లస్టర్ పరిధిలో గల వైద్య సిబ్బంది రోగుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆయన ఈ సందర్భంగా ఆదేశించారు. అదేవిధంగా వర్షకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. జలుబు, దగ్గు, జ్వరములతో బాధపడుతున్న వారిని గుర్తించి, వారికి మందు బిళ్ళలను పంపిణీ చేయాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. గ్రామంలో తిరుగుతూ ఇంటి చుట్టూ నీళ్ల, ట్యాంకులు, కొబ్బరి చిప్పలు పూలకుండీలలో నిల్వ ఉన్న నీటిలలో దోమల లార్వాలను గుర్తించి పారబోయించాలని, చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సంతోష్, హెల్త్ సూపర్‌వైజర్ స్వర్ణలత, మౌనిక, వాణి, వైష్ణవి, ఏఎన్‌ఎం, తదితరులు ఉన్నారు.



ఉట్నూర్‌లో కంట్రోల్ రూంను ప్రారంభిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఒక్క సీసీ కెమెరా వంద పోలీసులతో సమానం

● 50 సీసీ కెమెరాలను ప్రారంభించిన ఎస్పీ అఖిల్
● సహకరించిన ఐటీడీఏ పీవో

వివరాలు 7వ పేజీలో....